



మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

'దుర్గం'లో మాటల యుద్ధం..!



- ఎమ్మెల్యే వర్సస్ మాజీ ఎంపీ
- ఆరోపణలు...ప్రత్యారోపణలు
- హీటెక్కిన దుర్గం రాజకీయం

ఇటీవల కళ్యాణదుర్గం నియోజకవర్గం రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నేతలు వ్యక్తిగత ఆరోపణలకు సైతం దిగుతుండడం రాజకీయా వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. నియోజకవర్గ కేంద్రంగా చోటు చేసుకుంటున్న రాజకీయ, అవినీతి సంఘటనలతో అధికార పార్టీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ రంగయ్యల మధ్య మాటకుమాట పెరుగుతోంది.



ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

వైసిపి సమన్వయకర్త రంగయ్య సేవ్ ఆర్డీటీ పేరుతో నియోజవకర్గంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సమయంలో ఆయన ఎమ్మెల్యే అమిలినేనిపై పలు వ్యాఖ్యలు చేశారు. తన పాదయాత్రను పోలీసుల ద్వారా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆటంకాలు సృష్టిస్తున్నారంటూ రంగయ్య విమర్శలు గుప్పించారు. ఆర్డీటీ పేరుతో రంగయ్య రాజకీయ ఉనికి కోసం పాకులాడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే ప్రతివిమర్శలు చేస్తూ వచ్చారు. ఇటీవల వైసిపి విస్తృతస్థాయి సమావేశాల్లోనూ రంగయ్య ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. వ్యక్తిగతంగా తనపైనా, తన కంపెనీపైనా విమర్శలు చేస్తే 'మీ ఇంటికి వచ్చి నిలదీసే దమ్ము, ధైర్యం నాకుంది' అంటూ ఎమ్మెల్యే జవాబు ఇచ్చారు. ఇలా ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.

రాజకీయవేడి రగల్చిన ఈ-స్టాంపుల కుంభకోణం

కళ్యాణదుర్గం కేంద్రంగా వెలుగుచూసిన ఈ-స్టాంపుల కుంభకోణం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మరింత అలజడి రేపింది. 20 రోజుల కిందట ఈ-స్టాంపుల కుంభకోణం వెలుగుచూడడంతో రాజకీయ విమర్శలకు టీడీపీ, వైసీపీ మరింత పదునుపెట్టాయి. ఈ-స్టాంపుల కుంభకోణం ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో సుమారు వారం రోజుల పాటు సంచలనం రేకెత్తించింది. నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణంలో ఎమ్మెల్యే సురేంద్రబాబుకు అత్యంత సన్నిహితుడుగా వ్యవహరిస్తున్న ఎర్రప్ప అలియాస్ మీసేవా బాబు పాత్ర వెలుగు చూడడంతో ప్రతిపక్ష వైసీపీ, ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యే విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. స్వయాన ఎస్ఆర్‌సి ప్రతినిధులు ఈ-స్టాంపుల వ్యవహారంలో మీసేవా బాబు మాతో నమ్మకంగా ఉంటూ మోసగించాడని పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి పరిస్థితి ఎదురైంది. ఇక్కడ మొదలైన ఈ వ్యవహారం టీడీపీ, వైసీపీల మధ్య విమర్శల దుమారానికి దారితీసింది. స్వయాన వైసీపీ సమన్వయకర్త రంగయ్య ఇదంతా ఎమ్మెల్యే సురేంద్రబాబుకు తెలియకుండా జరగలేదని విమర్శలు పరంపర కొనసాగించారు. ఈ కుంభకోణంలో తనకు గానీ, తన కంపెనీకి ఎలాంటి సంబంధం లేదంటూ ఎమ్మెల్యే అమిలినేని తిప్పికొట్టారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాను సిద్ధమని కూడా ప్రకటించారు.

ఆరోపణలు.. ప్రత్యారోపణలు

ఇటీవల వైసీపీ విస్తృతస్థాయి సమావేశాల్లో ఈ-స్టాంపుల వ్యవహారంతోపాటు యాటకల్లు, ఐదుకల్లు గ్రామాల మధ్య కొండను నాశనం చేయడానికి ఎమ్మెల్యే పూనుకున్నారని రంగయ్య చేసిన వ్యంగ్రస్త్రాలు టీడీపీ నాయకులకు ఆగ్రహం తెప్పించాయి. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో కొనసాగుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు స్పందిస్తూ వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అవసరమైతే రంగయ్య కావచ్చు... ఇతర పార్టీల్లో టికెట్లు ఆశించి రాలేదని తప్పుడు సలహాలిస్తున్న మరొకవరు కావచ్చు...వారి ఇంటికే వెళ్లి నిలదీస్తానంటూ ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. ఇలాంటి విమర్శ, ప్రతి విమర్శలతో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కళ్యాణదుర్గంలో మాటల యుద్ధం చోటు నడుస్తూనే ఉంది. ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

- అర్ధరాత్రి నుంచి విధుల బహిష్కరణ
- జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆందోళనబాట పట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి విధులను బహిష్కరించి పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. గత 20 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించిని నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని కార్మికులు తెలిపారు. నిరసనలో భాగంగా శనివారం నాడు పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. జీవో 36 మేరకు వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, గ్రాడ్యుటీ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం నుంచి తాగునీరు సరఫరా, వీధి దీపాలు నిర్వహణ నిలిపివేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు తమ సమ్మెకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణ, రమేష్, గణేష్, రామదాసు, గంగాద్రి, సాయినాథ్ రెడ్డి, వెంకటేశు, సద్దాం, సాయినాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల సందర్భంగా యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనాలు అన్ని రంగాల కార్మికులకు అమలు చేయాలని తీర్పులు ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో మాదిరిగానే మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులందరికీ 62 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలను కల్పించాలి. దహన సంస్కారాలకు రూ. 20 వేలు ఇవ్వాలన్నారు.పనిముట్లు, ఏకరూప దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవితమ్మ, గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల్లా పేట్రేగిపోతున్న వైసిపి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి నాయకులు ఉగ్రవాదుల్లా పెట్రేగిపోతున్నారని, నరకండి.. చంపండి.. అంటూ ఆ పార్టీ కార్యకర్తలను ప్రజలపైకి ఉసిగొల్పుతున్నారని మంత్రి ఎస్.సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. అధికారం శాశ్వతం కాదని గ్రహించని వైసిపి నాయకులు జగన్ ఐదేళ్ల పాలనలో చట్టాలు, నిబంధనలను అతిక్రమించి అక్రమ సంపా దనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి అక్రమాలు బయటపడు తుండడంతో వారి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. జైలుకెళ్లాల్సి వస్తోందనే భయంతో కూటమి ప్రభుత్వం, అధికారులు, ప్రజలపై కక్ష పెం చుకున్నారన్నారు. జగన్ దళితుడైన సొంత పార్టీ కార్యకర్తను కారు కింద వేసి తొక్కించా డన్నారు. గోదాములో నిల్వ ఉంచిన 4 వేల రేషన్ బియ్యం బస్తాలను పేర్ని నాని మాయం చేశాడని, ఇదే విషయమై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. మరో వైసిపి మాజీ ఎమ్మెల్యే మహిళా ఎమ్మెల్యేను దూర్భాషలాడాడన్నారు. ఆ పార్టీ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం కార్యకర్తలనే పావులా వాడుకుం టున్నారని, జాగ్రత్తగా ఉండాలని వైసిపి కార్యకర్తల కు సూచించారు. వైసిపి నాయకులు ఎంత రెచ్చ గొట్టినా కూటమి శ్రేణులు వారి వలలో పడరని, సంయమనంతో ఉంటారని స్పష్టం చేశారు. ప్రజలు వైసిపి మాటలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణానికి టిడిపి నాయకులు వితరణ చేశారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ చంద్రమోహన్ యాదవ్ రూ.10,001 నగదును ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. విరాళం అందజేసిన చంద్రమోహన్‌కు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.



నగదును అందిస్తున్న చంద్రమోహన్ యాదవ్

సెప్టెంబర్ 13, 14న అనంతలో

మధ్యాహ్న భోజనం యూనియన్ రాష్ట్ర మహాసభలు

విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సెప్టెంబర్ 13,14వ తేదీల్లో అనంతపురంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. శనివారం స్థానిక గణేనాయక్ భవనంలో మహాసభల సన్నాహక సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం పేరు మార్పు చేశారని, మెనూ మార్చారని, కార్మికుల బతుకులు మాత్రం మారలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచడం లేదన్నారు. నెలల కొద్ది బిల్లులు, వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. బకాయి వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి మెనూ ఛార్జీలు కనీసం రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వంట గ్యాసు సరఫరా చేయాలన్నారు. వంట చేసేటప్పుడు అనేక ప్రమాదాలకు కార్మికులు గురవుతున్నారని, పాఠశాలల్లో ప్రథమ చికిత్స మెడికల్ కిడ్స్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మిడ్ డే మీల్స్ కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ సరఫరా చేయాలన్నారు. 10 నెలలకి వేతనం ఇస్తున్నారని, 12 నెలలకు వేతనం ఇవ్వాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకూడదని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపైనా రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మహాసభల విజయవంతానికి జిల్లాలో ఉన్న కార్మికులు ఉపాధ్యాయులు, ప్రజలు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య, యూనియన్ నాయకులు పద్మావతి, ఒసురమ్మ, శివలింగమ్మ, మంజుల, రాజేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి

యూరియాకు భలే డిమాండ్

సొసైటీ కార్యాలయం వద్ద రైతుల బారులు



ఎరువుల కోసం సొసైటీ కార్యాలయం వద్ద వేచి ఉన్న రైతులు

ప్రజాశక్తి-రొద్దం

యూరియా కోసం శనివారం స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద రైతులు బారులు తీరి నిలబడ్డారు. రొద్దం పంచాయతీలో 3 సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో మూడు రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఆ మూడు కేంద్రాలు 1, 2 కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయి. రొద్దం పంచాయితీలో 11 గ్రామాలు ఉండగా రెండు గ్రామాల రైతులకు మాత్రం అవి అందుబాటులో ఉంటాయి. మిగిలిన గ్రామాలకు దూర దూరం కావడంతో రొద్దం రావాల్సిన పరిస్థితి. అంతేకాకుండా శనివారం సెలవు కావడంతో ఒక్కసారిగా వంద మందికి పైగా రైతులు యూరియా కోసం సొసైటీ వద్ద చేరుకొని అవస్థలు పడ్డారు. అందులో కూడా ఒక్కొక్కరికి 5 నుంచి 10 ప్యాకెట్లు కావాల్సి ఉండగా తక్కువ ఉన్నందున ఉదయం కొందరికి మాత్రం లభించాయి. అనంతరం మధ్యాహ్నం 2 లారీల యూరియా రావడంతో రైతులు ఊపిరి పీల్చుకొన్నారు. మండలంలో ఎక్కువగా మొక్కజొన్న పంట సాగు చేస్తుండడంతో యూరియాకు బాగా డిమాండ్ ఏర్పడిందని ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేనిచో విధి లేక ప్రయివేట్ దుకాణాలకు వెళ్లి అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు.

నిరుపయోగంగా ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్..!



ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి భవనం(ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్) నిరుపయోగంగా పడి ఉంది. గతంలో ఈ భవనంలో పలు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేవారు. ఎంతో మంది ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు విడిది చేసేవారు. అయితే సుమారు దశాబ్ద కాలంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ భవనాలను నామమాత్రంగా ఉపయోగించుకుం టున్నారు. నాయకులు వారి వ్యక్తిగత కార్యాలయాలు లేదా ఇళ్ల నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తుం డడంతో ఈ భవనాల నిర్వహణ కూడా అటకెక్కిందన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఇక్కడ ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అధిక సమయం ఈ భవనంలోనే ఉండేవారు. అంతేకాకుండా ఈ విశ్రాంతి భవనం దాదాపుగా అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు చేరువలో ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకకాలంలో అందుబాటులో ఉండేవారు. కానీ ఇప్పుడు పార్టీ కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, నాయకులకు పట్టణంలో సొంత ఇల్లు ఉండటం, అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తుండడంతో దీనిని ఉపయోగించు కోవడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో ఈ భవనం వైపు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు రాకపోవడంతో బోసిపోయి దర్శనమిస్తోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ భవనంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఇక్కడ అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

కంటి జబ్బులపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కంటికి సంబంధించిన జబ్బులపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రినిటీ సర్వీసెస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణిలు సూచించారు. శనివారం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సంబంధిత సంస్థ ఆధ్వర్యంలో 124వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు ధనుశ్రీ, అంజలిలు కంటి జబ్బులతో బాధపడుతున్న బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 540 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 210 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ బెంగుళూరులోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, కంటి అద్దాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ నరసింహా మూర్తి, రహమతుల్లా, క్యాంప్ ఇన్‌ఛార్జి శివ ప్రకాష్, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సికి ఆగిన నీటి సరఫరా

రెగ్యులేటర్ దింపిన అధికారులు

ప్రజాశక్తి-బొమ్మనహల్

జిల్లాలోని బొమ్మనహాల్ సమీపం ఆంధ్ర సరిహద్దులో హెచ్ఎల్సీ కాలువకు నీటి సరఫరా ఆగింది. 105 కిలోమీటర్ల వద్ద రెగ్యులేటర్లను అధికారులు కిందకు దించేశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఈ నెల 10వ తేదీన హెచ్ఎల్‌సి కాలువకు నీటిని విడుదల చేశారు. ఆ నీరు శనివారం సాయంత్రం ఆంధ్ర సరిహద్దు బొమ్మనహాల్ ప్రాంతానికి రావాల్సి ఉంది. అయితే 105 కిలోమీటర్ల నుంచి ఆంధ్రాలో కాలువల మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ పనుల నేపథ్యంలో కర్ణాటక సరిహద్దులోనే అక్కడి అధికారులు నీటిని ఆపేశారు. నీరురాకపోవడంతో జిల్లా రైతులు తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు. హెచ్ఎల్సీ కాలువల మరమ్మతులకు సంబంధించి గుత్తేదారులు వారు తీసుకున్న పనులను నత్తనడకన చేస్తున్నారు. నీరు వచ్చే సమయానికి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పనులు పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ప్రస్తుతం నీరు అందకుండా పోయాయి. ఈ నీరు వచ్చి ఉంటే పంటలు, తాగునీటికి ఉపయోగంగా ఉండేది. అనంతపురం జిల్లాకు తాగునీటి కోసం నెల రోజుల పాటు ఈ కాలువ ద్వారా నీటిని వదలాల్సి ఉంది. అనుకున్న సమయంలో నీరు రాకపోడంతో నెల రోజుల పాటు నీటి సరఫరా ఉంటుందా.. లేదా.. అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం చేస్తున్న పనులు పూర్తవడానికి ఇంకా 20 రోజులు సమయం పడుతుందని హెచ్ఎల్సీ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత నీటి విడుదల ఎలా ఉంటుందన్న అంశం అప్పటి పరిస్థితులను బట్టి ఉంటుంది. పనులు నెమ్మదిగా జరుగుతున్నా వాటిని వేగవంతం చేయించడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపడంపై రైతుల నుంచి అసహనం వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను వేగవంతం చేయించి అనుకున్న సమయానికి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.




105 కిలోమీటర్ వద్ద ప్రధాన కాలువ వద్ద రెగ్యులేటర్ దింపివేసిన దృశ్యం

కో-ఆపరేటివ్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షులుగా శ్రీరాములు

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్ర ప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీ సత్యసాయి జిల్లా యూనిట్ అధ్యక్షులుగా హిందూపురం పట్టణానికి చెందిన పిహెచ్ శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సభ్యులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.



శ్రీరాములు

ప్రాధాన్యతాక్రమంలో హామీల అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

సిఎం చంద్రబాబు ఎన్నికల హామీలను ప్రాధాన్యతాక్రమంలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మండలంలోని కేశాపురం పంచాయతీలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఏడాదిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 20 రోజులుగా గ్రామంలో తాగునీటి సమస్య నెలకొందని వెంకటాపురం గ్రామస్తులు మొరపెట్టుకోగా ఎమ్మెల్యే తక్షణమే అధికారులను పిలిపించి నీటి సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నియోజకవర్గంలోని 193 చెరువులు, 2 రిజర్వాయర్లను హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో నింపుతామని జిల్లాలో తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలను దశల వారీగా అమలు చేస్తామన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, ఇళ్ల సమస్యలను తమ దృష్టికి వచ్చాయని త్వరలోనే వాటిని పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, భాగ్యలక్ష్మి హర్షవర్ధన్‌చౌదరి, సాయికుమార్, శంకర, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూర

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

అమీన్‌నగర్, న్యూఅమీన్‌నగర్ పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జివిఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో సైదా పురం పొలం సర్వే నెంబర్-294లోని ప్రభుత్వ భూమిలో జెండాలు నాటారు. నరసింహులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం పేదలు 5 నెలల నుంచి సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టారని తెలిపారు. సచివాలయాల్లో దరఖాస్తులు అందజేసి 4 నెలలవుతున్నా రెవెన్యూ అధికారులు వాటిపై విచారణ కూడా చేయలేదన్నారు. పేదలు రోజువారీ కూలి డబ్బులు తో కుటుంబాలను పోషించుకోవడమే భారంగా ఉందన్నారు. ఇంటి అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పాత, కొత్త అమీన్‌నగర్ పరిధిలోని పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీ మేరకు అర్హులకు పట్టణంలో 2 సెంట్ల చొప్పున స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పేదల దరఖాస్తులపై విచారణ చేపట్టి వారం రోజుల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని, లేనిచో ఈ భూమిలో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబ శివ, బాబ్‌జాన్, రామ్మోహన్, నారాయణ, ముస్తాక్, రఫీ, ఉదయ్, శంకర్‌రెడ్డి మహిళలు గాయత్రి, సాదియా, అంజనమ్మ, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.


ఫొటో : ప్రభుత్వ స్థలంలో సిపిఎం జెండాలు పాతిన నాయకులు

వైసిపికి కార్యకర్తలు, నాయకులే మూల స్తంభాలు : కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వైసిపికి కార్యకర్తలు, నాయకులే మూల స్తంభాలు అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కేతిరెడ్డి నివాసంలో శనివారం వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి కేతిరెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు. కేతిరెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహపడొద్దని, ప్రజలు మన వెంటే ఉన్నారని ధైర్యం చెప్పారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని సూచించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి కార్యకర్తగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, వైస్‌ఛైర్మన్‌గా పని చేశానని తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడానన్నారు. రాష్ట్రస్థాయి పదవి ఇచ్చి ప్రోత్సహించినందుకు పార్టీ అధినేత జగన్, కేతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ విభాగం అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. అంతకుముందు చందమూరి నారాయణరెడ్డిని 37వ వార్డు ప్రజలు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, నాయకులు అభినందించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బాలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాసపల్లి సాయికుమార్, రంగస్వామి, బాలం గోపాల్, కత్తే పెద్దన్న, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, మిద్దె మల్లికార్జున, రామలింగంగౌడ్, చిన్ననారాయణరెడ్డి, బాలనరసింహులు, కడవల ఈశ్వర్, మద్దిలేటి, కంబగిరి, చెన్నప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.


కేతిరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజా సమస్యల పరిష్కారానికే 'తొలిఅడుగు' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. మండల కేంద్రమైన రొళ్లలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి సుపరిపాలనకు సంబంధించిన కర పత్రాలు పంపిణీ చేశారు. సంవత్సర కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సవ్యంగా అందుతున్నాయా, లేదా..? అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని, వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్య లను పరిష్కరించాలని ఆదేశించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆయా గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. అందులో గుర్రపుకొండ గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మకు రూ. 1.75లక్షలు, నాగలక్ష్మికి రూ. 15వేలు, గుడిబండ మండలంలోని శంకరగల్లు గ్రామానికి చెందిన చంద్రమ్మకు రూ.36,748, జమ్ములబండ రత్నమ్మకు రూ. 15వేలు, కెఎన్.పల్లి పుట్టమ్మకు రూ. 16వేల చెక్కులను అందజేశారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మండల కేంద్రమైన రొళ్లకు చెందిన వైసిపి నాయకులు తిప్పేస్వామి, గోవిందరాజు, హరీష్, వీరేష్, బాలకృష్ణ, గంగాధర్, రంగధామ, కృష్ణమూర్తి, ప్రసాద్, సతీష్‌తో పాటు 10 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. చేరిన నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరామన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, నాయకులు విఎం.పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్. గురుమూర్తి, మండల కన్వీనర్ జికె.ఈరన్న, ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ, కో కన్వీనర్ మారుతిప్రసాద్, బిసి సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, బారిపల్లెప్ప, హేమంత్ కుమార్, బాలకృష్ణ, భరత్, దాసిరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

గుడిబండ : మండలంలోని ఇటికేపల్లి, ముత్తుకూరు గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వాటిని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గిరిప్రసాద్, నరసప్ప, వేణుగోపాల్‌రెడ్డి, హనుమంతరావు, డీలర్ నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులు కాదు.. టిడిపి పటిష్టతే లక్ష్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పదవులు ఇచ్చినా, ఇవ్వకున్నా టిడిపి లోనే ఉంటానని, అయితే 40 ఏళ్లుగా నిస్వార్థంగా పార్టీ కోసం పని చేసినా తగిన గుర్తింపు లభించ లేదని మండలంలోని కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఆవుల సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కషి చేశానన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల పేరు చెప్పి తనను పార్టీ నుంచి బహిష్కరించినట్లు పత్రికా ప్రకటన విడుదల చేయడం కలచి వేసిందన్నారు. కొత్తచెరువు పర్యటనకు వచ్చిన సమయంలో సిఎం చంద్రబాబును కలవడానికి ప్రయత్నించగా కొందరు అడ్డుకున్నారని వాపోయాడు. త్వరలోనే పార్టీ అధిష్టాన్ని కలిసి జరిగిన విషయాలను వివరిస్తానని తెలిపారు. మండలంలో పదవులు అనుభవించిన వారికే మళ్లీ పదవులు కట్టబెడుతున్నారే తప్ప, బిసిలు, బలిజలకు ప్రాధాన్యత కల్పించలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

టిబిపై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ గళ్ల పరీక్ష చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సిఎస్. సోమశేఖర్ సూచించారు. ఫ్యామిలీ డే కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సచివాలయం-2 పరిధిలో వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు క్షయ(టిబి)పై అవగాహన కల్పించారు. ఆర్.మరవపల్లి గ్రామంలో 60 ఏళ్లు పైబడిన వారిని, పొగ, మద్యం తాగే వారిని, టిబి వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్న వారిని సమావేశపరిచి, ప్రతి ఒక్కరూ విధిగా గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. టిబి నిర్ధారణ అయిన వారికి ఆశా కార్యకర్త ద్వారా బరువును బట్టి మాత్రలు ఇస్తారని తెలిపారు. ఇది 6 నెలల చికిత్స కార్యక్రమమని చికిత్స కాలంలో నెలకు రూ.1000 చొప్పున ఇస్తారన్నారు. ఇది వంద రోజుల ఇంటెన్సిఫైడ్ టిబి కార్యక్రమం అని, ప్రతి ఒక్కరూ టిబి వ్యాధి నివారణకు సహకరించాలని కోరారు. గళ్ల పరీక్షకు 20 మంది శ్యాంపిల్స్ పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ టిబి సూపర్వైజర్ శశిధర్, సిహెచ్ఒ హెచ్.శశికళ, పిహెచ్ఎన్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్వైజర్, ఆరోగ్య కార్యకర్త, 104 పైలెట్ నాగరాజు, ఆశా కార్యకర్త శ్యామల, తదితరులు పాల్గొన్నారు.


క్షయపై అవగాహన కార్యక్రమం చేపట్టిన వైద్యాధికారులు, సిబ్బంది

అల్లాపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా శివారెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు



మండలంలోని అల్లాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా టిడిపి సీనియర్ నాయకులు బోయపల్లి బొల్లం శివారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యా యి. అలాగే సొసైటీ డైరెక్టర్లుగా మద్దుకవారిపల్లి బాలు, సున్నంపల్లి నారాయ ణప్ప ఎంపికయ్యారు. నూతన అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపే తానికి నిస్వార్థంగా సేవలు అందించానని, తన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి సింగిల్‌విండో అధ్యక్షునిగా ఎంపిక చేసిందన్నారు. ఈ పదవి నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు. నా ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శివారెడ్డిని శనివా రం టిడిపి నాయకులు, రైతులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి పారు. పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మా నించారు. కార్యక్ర మంలో నాయకులు రాజగోపాల్, ఆర్ఎంపి కృష్ణమూర్తి, డీలర్ శివనారాయణ, పలక గంగన్న, రమణ, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎంజెపి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-గుడిబండ

ప్రభుత్వం నుంచి వచ్చిన స్టడీ మెటీరియల్, ట్రంకు పెట్టెలు, గ్లాసులు, పాత్ర, నోట్ పుస్తకాలు, తదితర సామగ్రిని శనివారం ప్రిన్సిపల్ ప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనర్సప్ప స్థానిక ఎంజెపి కళాశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. నరసప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. పాఠశాల, కళాశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, షబ్బీర్, మద్దనకుంటప్ప, మంజునాథ్, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్, నాయకులు

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని 18వ వార్డులో పర్యటించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ అంశాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ప్రజలు హర్ష వ్యక్తం చేశారు. ప్రజలు పలు సమస్యలను వివరించగా వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా బహువుద్దీన్, వైస్ ఛైర్‌పర్సన్ సుధారాణి, బాబయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి పరిధిలోని పలు గ్రామాల్లో బహిరంగ, నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీసులు డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఉంచారు. మండలంలోని కర్నాటకనాగేపల్లి, వీరచెన్నయ్యపల్లి గ్రామాల పొలాలు, శివారు ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో నేరాలకు తావు లేకుండా ఉండేందుకు పోలీస్ అధికారులు డ్రోన్ల నిఘాను పెంచారు. ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ లింగన్న, పోలీసులు స్టేషన్ పరిధిలో డ్రోన్ ఎగురవేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్‌టీజింగ్, తదితర నేరాలు జరగకుండా శివారు ప్రాంతాలతో పాటు తోటలను ముందుగా గుర్తించి డ్రోన్ పంపి నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టే వేసే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు.

గుడిబండ : మండలంలోని పరిసర ప్రాంతాల్లో పేకాట, జూదం, తదితర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న అనుమానంతో డ్రోన్ కెమెరా ద్వారా ప్రత్యేక నిఘా, పర్యవేక్షణ చేపట్టామని ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా పేకాట, తదితర జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోతుకుంటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రూరల్ పరిధిలోని పోతుకుంట సచివాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని నిర్వాహకులు దవలం హరి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పోతుకుంట గ్రామంలో తొలిసారిగా వైద్య శిబిరరం ఏర్పాటు చేయడం ఎంతో తృప్తినిచ్చిందని తెలిపారు. శిబిరంలో రక్తపోటు, చక్కెర, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. స్థానిక గండికోట ఆసుపత్రి అధినేత డాక్టర్ బి.రాజశేఖర్‌రెడ్డి 156 మంది రోగులకు వైద్య చికిత్సతో పాటు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

అదును దాటుతున్నా పదును కరువు..!

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగతో పాటు ఇతర అంతర పంటలు సాగు చేయడానికి జిల్లాలో రైతులు సిద్ధమైనా అదును దాటుతున్నా పదును కావడం గగనమైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవగా రైతులు దుక్కి దున్ని విత్తనం వేయడానికి పొలాలను సిద్ధం చేశారు. కాగా వరుణుడు కరుణించడం లేదు. జిల్లాలో రోజూ మేఘావృతం కావడం, దట్టంగా మేఘాలు కమ్ముకుంటున్నా చినుకు మాత్రం రాలడం లేదు. జులై నెలలో ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తే దిగుబ డులు బాగుంటాయని రైతులు అభిప్రాయపడుతు న్నారు. ఈ ఏడాది సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు భావించినా ఆ మేరకు వర్షాలు కురవడం లేదు. మరో 20 రోజుల్లో చినుకు పడకపోతే ఈమారు ఖరీఫ్ పంటలు లేనట్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2,22,950 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇందులో ఈ సారి 80 శాతం సాగు అవుతుందని వ్యవ సాయ అధికారులు భావించారు. ప్రభుత్వం కూడా జిల్లాకు రాయితీపై 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ, 1,275 క్వింటాళ్ల కందులు కేటాయించారు. పంట పెట్టుబడికి అన్నదాత సుఖీభవ నిధులు కూడా ఇంతవరకూ ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇచ్చి ఆదుకుంటామని ప్రస్తుత పాలకులు హామీ ఇచ్చారు. తీరా ఇప్పుడు పంట పెట్టే సమయంలో రూ. 7వేలు మాత్రమే ఇస్తామంటున్నా ఆ నిధులు కూడా విడుదల చేయలేదు. ఏదేమైనా ప్రకృతి కరుణించకపోతే ఈ ఖరీఫ్‌లో పంట సాగు కష్టమేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సాగుకు సన్నద్ధం అవుతున్న రైతు

సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు..

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అర్ధరాత్రి నుంచే విధుల బహిష్కరణ



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు, పారిశుధ్య ఒప్పంద కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో 16 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ముందు రిలే దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. 17వ రోజైన శనివారం కూడా వారు దీక్షలను కొనసాగించారు. శిబిరంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు బొగ్గు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో-36 మేరకు వేతనాల చెల్లింపు, గత సమ్మె కాలపు ఒప్పంద వేతనాలు, ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం కాల యాపన చేస్తుందన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్స్‌పై స్పందించకపోతే శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. ఇందులో భాగంగా అత్యవసర విభాగాలైన నీటి సర ఫరా, వీధి లైట్లు, పైప్‌లైన్ మరమ్మతులు, డ్రైవర్స్, హెల్పర్స్, తదితర విధులను బహిష్కరిస్తామని ఎపి మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సంఘం(సిఐటియు ధర్మవరం మున్సిపాలిటీ)రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపా మన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయకృష్ణ, అనిల్, బాబు, శివయ్య, కాటమయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, యోగేష్, గాలి శీన, హరి పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి-తాడిమర్రి

రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా.. సంక్షేమ పథకాల అమలులో సిఎం చంద్రబాబు ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. మండలంలోని శివంపల్లి గ్రామంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో శ్రీరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్థానికన టిడిపి శ్రేణులు, గ్రామస్తులు శ్రీరామ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కొందరు పథకాలు రాలేదని చెప్పగా అందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వీటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు పలు సమస్యలను వివరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ తాము చేసింది చెప్పుకోవడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఇది మంచి అవకాశం అన్నారు. ఇంకా నాలుగేళ్లలో చేయాల్సింది చాలా ఉందని, ఇందుకు ప్రజల సహకారం కావాలని కోరారు. అనంతరం ఆయన మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. బూత్ ఇన్‌ఛార్జిలు డోర్ టూ డోర్ వెళ్లాలని, నిర్లక్ష్యంగా వహిస్తే ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల నాగభూషణం, టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, నాయకులు కె.రాజశేఖర్, కె.సాయిప్రసాద్, ఆకులేటి అశ్వర్థ, కళ్లాయిరెడ్డి, హర్ష, విశ్వనాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

సిఐ చొరవతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ధర్మవరం రోడ్డులో శనివారం మధ్యాహ్నం అనంత పురం నగరానికి చెందిన అశోక్ అనే వ్యక్తికి చెందిన ప్రణయ్ పవర్ సిస్టమ్‌కు చెందిన ఒక పెద్ద జనరేటర్‌కు వెల్డింగ్ చేస్తుండగా మంటలు వ్యాపించాయి. అదే సమయంలో కేశాపురం గ్రామంలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం బందోబస్తులో ఉన్న కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ జి.మారుతి శంకర్ వెంటనే అప్రమత్తమై మంటలు రేగిన జనరేటర్‌ను మరో వాహనానికి తగిలించుకొని సర్వీస్ సెంటర్ చెంతకు సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పివేశారు. మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సిఐతో పాటు పోలీసులు వీరునాయక్, భాస్కర్ పాల్గొన్నారు.

వ్యవసాయ బోరు ధ్వంసం

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని మోరంపల్లి గ్రామానికి చెందిన రైతు జి.గోపాల్ వ్యవసాయ తోటలోని బోరుబావిని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగులు శుక్రవారం రాత్రి బోరు కేసింగ్ పైపులు కోసి, లోపల రాళ్లు వేసి పూర్తిగా దెబ్బతీశారని బాధిత రైతు వాపోయాడు. ఈ ఘటన వల్ల పంటలకు నీటి సరఫరా నిలిచిపోయి తీవ్రమైన ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతు పోలీసులను కోరాడు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

రచయిత, సీనియర్ జర్నలిస్టు అవార్డు గ్రహీత టిడి జయరామ్‌రెడ్డిని ధన వర్షిని చెక్క గానుగ ఆయిల్స్ అండ్ నేచురల్ ప్రొప్రైటర్, మాజీ జర్నలిస్ట్ కె.హరికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అతిథులు మాట్లాడుతూ జయరామిరెడ్డి సామాజిక, నైతిక విలువలు పెంపొందించడం కోసం అక్షరాలతో సమాజ మార్పునకు కృషి చేశారని, అందుకుగానూ ఆయనకు పలు అవార్డులు దక్కాయన్నారు. ధన వర్షిని చెక్కగానుగ ఆయిల్స్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత జయరామిరెడ్డిని సన్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పల్లె రామలింగారెడ్డి, సమాచార చట్టం అధ్యక్షులు శ్యామ్‌కుమార్, జర్నలిస్టు కె.శివప్ప, రామచంద్ర, కుళ్లాయప్ప, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సిఎం చంద్రబాబుదే

ప్రజాశక్తి-రొద్దం

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తూ అన్ని వర్గాల మన్ననలు పొందిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి మండల నాయకులు పేర్కొన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు శనివారం మండలంలోని రొద్దం, లోచర్ల, పెద్దమంతూరు, రొప్పాల, పెద్దకోడిపల్లి, చిన్నమంతూరు, జక్కలచెరువు, నారనాగేపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించారు. వారు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో సూపర్ సిక్స్ పథకాలే కాకుండా అనేక హామీలు నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, మండల కన్వీనర్ నరహరి, వెంకటరామిరెడ్డి, చంద్రమౌళి, పవన్, సిద్దన్న, బాషా, రాము, పుల్లప్ప, చిన్నకేశవులు, మురళి, నరసింహులు, రామంజి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బీడుపల్లి గ్రామానికి చెందిన చాకలి మహేంద్ర(32) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మహేంద్ర అప్పుల బాధ తాళలేక శుక్రవారం రాత్రి తన ఇంటి బాత్‌రూంలో చీరతో ఉరి వేసుకొన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పుట్టపర్తి అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహేంద్రకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

చోరీకి విఫలయత్నం

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రాంతంలోని పాత క్వార్టర్స్‌లో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీకి విఫలయత్నం జరిగిందని ఇంటి యజమాని పాములూరి నాగరాజు తెలిపారు. రెండు రోజులుగా ఇంటి వద్ద ద్విచక్ర వాహనం ఉండటంతో ఇద్దరు గుర్తుతెలియను వ్యక్తులు ద్విచక్ర వాహనం చోరీకి ప్రయత్నించగా చిన్నపాటి శబ్దం రావడంతో ఇంట్లో నుంచి బయటకు వస్తూ కేకలు వేయడంతో ఆ వ్యక్తులు పారిపోయారన్నారు. స్థానికులతో కలిసి చుట్టుపక్కల వీధుల్లో వెతికినా అప్పటికే పారిపోయారు. 8 నెలలుగా ఎస్ఐ లేకపోవడం, పోలీసుల పర్యవేక్షణ కొరవడడంతోనే దొంగలు చోరీలకు ప్రయత్నిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నాతాధికారులు స్పందించి తక్షణమే ఎస్ఐని నియమించి గ్రామాల్లో పోలీసుల నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

రూ.18 లక్షల బంగారు ఆభరణాలు, కారు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన అంతర్‌రాష్ట్ర దొంగను హిందూపురం పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.18 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలు, ఒక కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాడు హిందూపురం రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హిందూపురం డీఎస్పీ కెవి.మహేష్, సిఐలు ఆంజనేయులు, జనార్ధన్, అబ్దుల్ కరీం, రాజగోపాల్ నాయుడుతో కలిసి వెల్లడించారు. గత వారం హిందూపురం రూరల్ మండల పరిధిలో జరిగిన దొంగ తనం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని హిందుపురం రూరల్ యుపిఎస్ ఇన్‌స్పెక్టర్ అంజినేయులు, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జనార్ధన్, చిలమత్తూరు ఎస్ఐ మునీర్ అహమ్మద్‌తో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా ధర్మవరానికి చెందిన షేక్ ఖాజాపీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో అతని నుంచి పల్సర్ ద్విచక్ర వాహనం, దొంగతనానికి ఉపయోగించిన కారును సీజ్ చేయటంతో పాటు రూ.18 లక్షల విలువ చేసే వివిధ రకాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.


అరెస్టును చూపిస్తున్న డీఎస్పీ మహేష్